సాక్షి
ములుగు

సోమవారం | 30 | సెప్టెంబర్ | 2024



ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు..
వరంగల్ లక్ష్మీపురంలోని కూరగాయల కమీషన్ వ్యాపారుల సంఘం నూతన పాలకవర్గానికి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని వ్యాపారులు డిమాండ్ చేశారు. - 8లో▸



గుప్త నిధుల కోసం తవ్వకాలు
హనుమకొండ జిల్లా దామెర మండలం పులుకుర్తి శివారులోని చంద్రగిరి గుట్టల్లో దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/26^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ములుగు: జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నేడు(సోమవారం) నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దివాకర ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా నిర్భయంగా అందించవచ్చని తెలిపారు. జిల్లా అధికారులతో పాటు తొమ్మిది మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు విధిగా ప్రజావాణికి హాజరుకావాలని కోరారు. తమవెంట పెండింగ్ ఫైల్స్ వివరాలను తీసుకురావాలని ఆదేశించారు.

కలెక్టర్ దంపతుల పూజలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని కలెక్టర్ రాహుల్‌శర్మ-కాత్యాయని దంపతులు దర్శించుకున్నారు. ఆదివారం వారు ఆలయ రాజగోపురం వద్దకు రాగా ఆలయ అర్చకులు, పండితులు వేదమంత్రోచ్చరణల నడుమ, మంగళవాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి గర్భగుడిలో పూజలు చేసి శ్రీశుభానందదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడి ఆశీర్వచన వేదిక వద్ద దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్ కలెక్టర్ దంపతులను స్వామివారి కండువాతో సన్మానించారు. అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదం అందజేశారు.

కాకతీయుల శిల్పసంపద అద్భుతం



గణపురం: కాకతీయుల శిల్ప సంపద అద్భుతంగా ఉందని.. దీనిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని పరకాల సివిల్ కోర్టు జడ్జి శాలినిలింగం అన్నారు. ఆదివారం గణపురం మండలకేంద్రంలోని కోటగుళ్లను ఆమె కోర్టు ఉద్యోగులు, సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటగుళ్ల శిల్పసంపద, పర్యావరణం అద్భుతంగా ఉందన్నారు. రామప్ప ఆలయంలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇంతటి గొప్ప శిల్ప సంపదను భావి తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయ అర్చకుడు నాగరాజు శాలువాతో సత్కరించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



చిట్యాల: విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదువుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని డిప్యూటీ కంట్రోల్ ఆఫ్ డ్రగ్స్ ఆఫ్ ఇండియా అధికారి డాక్టర్ రామ్‌కిషన్ అన్నారు. టెన్త్‌లో పదో తరగతి ఫలితాలలో ఉత్తమ జీపీఏ సాధించిన మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు జూకల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రతిభ అవార్డుల కార్యక్రమం ఏర్పాటు చేశారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాస్, సూదం సాంబమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రామ్‌కిషన్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఇష్టంగా కఠోర శ్రమతో చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. నాన్న ఉపాధ్యాయుడిగా పనిచేశాడని అతని జ్ఞాపకార్థం విద్యార్థులకు అవార్డులు అందజేసినట్లు చెప్పారు.

చైర్మన్‌ను నియమించాలి

కాళేశ్వరం: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, ఆర్టీఐ కమిషనర్‌ను వెంటనే నియమించి సామాన్య ప్రజలకు న్యాయం చేయాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీఓ సంస్థ జాతీయ అధ్యక్షుడు అయిలినేని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మానవ హక్కులపై మహదేవపూర్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాలన్నారు. ఎటువంటి వేధింపులు జరగకుండా ప్రత్యేకాధికారులను నియమించాలన్నారు.

నిధులు నిల్..



గిరివికాసం పథకానికి నిధుల కొరత

- మూడు సంవత్సరాలుగా మంజూరు చేయని ప్రభుత్వం
- పంటలకు అందని సాగునీరు
- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ



నిరుపయోగంగా ఉన్న బోరు

ఏటూరునాగారం: గిరివికాసం పథకానికి నిధులు నిలిచిపోయాయి. మూడేళ్లుగా నిధులు లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం 2017 ఏప్రిల్‌లో గిరివికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఐటీడీఏ పరిధిలోని గిరిజన రైతులకు 5 నుంచి 10 ఎకరాల్లోపు పట్టా భూమికి ఉచితంగా సాగునీరు అందించడానికి బోరు, మోటారు, విద్యుత్‌ను అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. డీఆర్‌డీఓ, ఐటీడీఏ అధికారులు సంయుక్తంగా ఈ పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసేవారు. ఈ పథకం కింద రూ.3నుంచి 5లక్షల మేరకు ఒక్కో బోరుకు ఖర్చు చేసేవారు. అయితే, 2021 డిసెంబర్ తర్వాత గిరివికాసం పథకం కింద ఎలాంటి నిధులు మంజూరు లేకపోవడం గమనార్హం. తొలుత ఐటీడీఏ పరిధిలోని ములుగు జిల్లాలో ఉన్న ఏజెన్సీ మండలాలకు మాత్రమే మంజూరు ఇచ్చేవారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 మండలాలకు సైతం ఈ పథకం వర్తించే విధంగా రూపకల్పన చేశారు.

ఎదురుచూపులు..

జిల్లాలోని సుమారు 313 మంది రైతులు 2021 నుంచి ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకొని గిరివికాసం పథకం కింద వచ్చే బోరు కోసం ఎదురు చూస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా వారికి ఎలాంటి మంజూరు లేకపోవడంతో సాగునీటి కోసం పక్క పొలాలు, వాగులపై ఆధారపడి పంటలను పండించుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ పథకంపై దృష్టి సారించడం లేదని గిరిజన రైతులు వాపోతున్నారు. 2019 వరకు రూ.48.68 కోట్లు మంజూరు ఇచ్చారు. అందులో కేవలం రూ.18 కోట్లు ఖర్చు చేసి 2,623 బోర్లు వేశారు. 5,458 ఎకరాలకు సాగునీటిని అందించినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది.



గిరివికాసం పథకానికి వచ్చిన దరఖాస్తులు

మండలం	దరఖాస్తుల సంఖ్య
ఏటూరునాగారం	51
ఎస్ఎస్ తాడ్వాయి	45
కన్నాయిగూడెం	32
మంగపేట	60
వాజేడు	34
వెంకటాపురం(కె)	26
వెంకటాపురం(ఎం)	29
గోవిందరావుపేట	22
ములుగు	14

ఆ తర్వాత మూడేళ్లుగా నిధులు రాకపోవడంతో దరఖాస్తుదారులు డీఆర్‌డీఓ, ఐటీడీఏ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

మూడేళ్లుగా నిరీక్షణ..



గిరివికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నాను. మూడేళ్లుగా ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాను. అయినా బోరు మంజూరు కావడం లేదు. ఏ అధికారి చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతోంది. పంటసాగుకు నీరు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

- రెడ్డి లక్ష్మయ్య, అల్లంవారిఘణపురం

పంటలకు నీరు అందడం లేదు..



పంటలకు సాగునీరు అందక ఇబ్బంది అవుతోంది. వాగు నీటితోనే పంటలను పండించుకోవాల్సి వస్తోంది. విద్యుత్ మోటార్లు లేక వానాకాలంలోనే పంటలను పండించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీరు అందించే విధంగా బోర్లు వేయించాలి.

- కాపుల సమ్మయ్య, చెల్పాక

చట్టాల అమలులో అధికారుల నిర్లక్ష్యం



నినాదాలు చేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: ఆదివాసీ చట్టాలను అమలు చేయడంలో జిల్లా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు పాయం కోటేశ్వరరావు ఆరోపించారు. మండల కేంద్రంలోని తుడుందెబ్బ మండల కమిటీ అధ్యక్షుడు మోకాళ్ల వెంకటేశ్ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని తొమ్మిది మండలాల్లో ఆదివాసీలు, నాయకపోడులు, చెంచు, రాజ్‌గొండు, గొత్తికోయలు నివాసం ఉంటున్నారని తెలిపారు. ఏజెన్సీలోని 1/70, పెసా చట్టాలు అమలులో ఉన్నాయని వివరించారు. ఈ ప్రాంతాల్లోకి కొందరు వలసవాదులు ప్రవేశించి వనరులను దోపిడీ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. చట్టాలపై అవగాహన కల్పించడంలో సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. కలెక్టర్ ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి కొర్నబెల్లి గణేశ్, నాయకులు కొప్పుల జగన్, గొరబోయిన మోహన్‌రావు, చర్పా రవి, కుర్సం రవికుమార్, అల్లెం నవీన్‌లు పాల్గొన్నారు.

'కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి'



మాట్లాడుతున్న రవీందర్

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో బండి నర్సయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం 44కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను అమలు చేయడం సరికాదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. హమాలీ, ట్రాక్టర్ డ్రైవర్స్, భవన నిర్మాణ కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాల రాజు, జక్కుల అయిలయ్య, శ్యాంసుందర్, సారయ్య, రాజేందర్, రమ, శోభ, సంపత్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా పింఛన్లు ఇవ్వాలి

కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్



సమావేశానికి హాజరైన గీత కార్మికులు

గోవిందరావుపేట: 50ఏళ్లు నిండిన ప్రతీ గీత కార్మికుడికి షరతులు లేకుండా పింఛన్లు ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని పస్రా సమీపంలోని రాంపూర్‌లో ఆదివారం సొసైటీ అధ్యక్షుడు జక్కు రాజు అధ్యక్షతన కల్లుగీత కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అర్హులైన గీత కార్మికులందరికీ మోపెడ్ బైకులు ఇవ్వాలని, ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ అని తేడా లేకుండా సేఫ్టీ మోకులు ఇవ్వాలన్నారు. ప్రతీ గీత కార్మికునికి పింఛన్ రూ.5వేలు ఇవ్వాలన్నారు. జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. జీవో నంబర్ 560 ప్రకారం తాటి చెట్ల పెంపకానికి 5 ఎకరాల భూమి ప్రభుత్వమే కొని ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధ కావాలని ఆయన గీత కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జక్కు నర్సయ్య, బుర్ర వేణు, బొమ్మగాని జగదీశ్వర్, జక్కు మొగిళి, మెరుగు సుధాకర్, పూజారి నర్సయ్య, దోనికెల మల్లికార్జున్, చిదురాల దుర్గప్రసాద్, కర్కొర్ల శ్రీనివాస్, పూజారి సారంగం తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సు సర్వీసుల కొనసాగింపు

ములుగు రూరల్: హనుమకొండ నుంచి ములుగు మీదుగా ఏటూరునాగారం వరకు ఆర్టీసీ వరంగల్-2 డిపో ఆధ్వర్యంలో అదనపు సెమీ డిలక్స్ బస్సు సర్వీసులను కొనసాగిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ డి.విజయభాను ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నుంచి ఏటూరునాగారం ఉదయం 7:30, 8:45, మధ్యాహ్నం 1:20, 2:15 గంటలకు, ఏటూరునాగారం నుంచి హనుమకొండకు ఉదయం 10:10, 11:30, సాయంత్రం 4:00, 5:00గంటలకు అదనపు సెమీ డిలక్స్ బస్సులను నడపనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేదల అభ్యున్నతే బీజేపీ లక్ష్యం



మాట్లాడుతున్న బలరాం

ములుగు రూరల్: దేశంలో పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతే బీజేపీ లక్ష్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. మండల పరిధిలోని పత్తిపల్లిలో 166, 167బూత్ శక్తి కేంద్రాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. దేశంలో బీజేపీ అత్యధిక సభ్యత్వాలు కలిగి ఉందని తెలిపారు. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీంద్రాచారి, భూక్యా రాజునాయక్, అడప భిక్షపతి, రాజ్‌కుమార్, సూర్యదేవర విశ్వనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థి అమరుల యాదిసభ నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

ములుగు రూరల్: పీడీఎస్‌యూ విద్యార్థి అమరవీరుల యాది సభను నిర్వహించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ నాయకులు పాల్, రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రామ పంచాయతీ గెస్ట్ హౌజ్‌లో పూర్వ పీడీఎస్‌యూ, ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశం ముంజాల భిక్షపతి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ నాయకులు పాల్, రమేష్ హాజరై మాట్లాడారు. పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50సంవత్సరాల స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా ములుగులో పీడీఎస్‌యూ విద్యార్థి అమరవీరుల యాదిసభ నవంబర్ 11న నిర్వహించాలని తెలిపారు. అమరవీరుల ఆశయాలకు అనుకూలంగా పని చేస్తామన్నారు. ములుగు ఉద్యమాల గడ్డ అని ఇక్కడ ఎంతోమంది అమరులైనారని తెలిపారు. అనంతరం ఆసంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు భిక్షపతి మాట్లాడుతూ ములుగు జిల్లా గోదావరి పరీవాహక ప్రాంతం అన్నారు. ఇక్కడ చాలా మంది అమరులయ్యారని వారి సేవలను కొనియాడారు. పెండెం రాజేందర్, వైనాల రవి, అల్లం ఓదేలు, మహేందర్, నర్సన్న, సాంబయ్య, రమ, స్వరూప, దేవక్క, సమ్మన్న పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



గొత్తికోయలతో మాట్లాడుతున్న డీఎస్పీ

పలిమెల: అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని, గూడెంలో కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి గొత్తికోయలకు సూచించారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా ఆదివారం మండలంలోని ముకునూర్ గుత్తికోయగూడెం గ్రామాన్ని మహదేవ్‌పూర్ సీఐ రాంచందర్‌రావు, ఎస్సై తమాషారెడ్డితో కలిసి డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గూడెంలో నుంచి ఎవరైనా ఇతర గ్రామాలకు వెళ్లినా కొత్త వ్యక్తులు గూడెంలోకి వచ్చినా తప్పకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

'ట్యాపింగ్' కథ మిగిలే ఉంది..!

15 రోజుల్లో 4,500 ఫోన్ల ట్యాపింగ్..

- ఇందులోనే ఉమ్మడి వరంగల్ వాటా
- జనగామ ఏరియాలో అనధికార కేంద్రం?
- బినామీలతో పని కానిచ్చిన ఓ అధికారి! రెండు నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి
- కాంగ్రెస్ అభ్యర్థులు, ముఖ్యనేతల ఫోన్ ట్యాపింగ్
- తాజాగా ఫిర్యాదులు స్వీకరించిన 'సిట్'
- ప్రభాకర్‌రావుకు 'రెడ్‌కార్నర్'.. చర్చనీయాంశంగా మారిన నోటీసు



సాక్షిప్రతినిధి, వరంగల్: ఎక్కడ ఏ సంఘటన, ఏ విచారణ జరిగినా.. చివరికి అది ఓరుగల్లును తాకుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, పియర్ల కుంగుబాటు..జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ.. వీటన్నింటి నేపథ్యంలో వరంగల్ పేరు పతాక శీర్షికల్లో నిలిచింది. ఇదే సమయంలో సెల్‌ఫోన్ ట్యాపింగ్ అంశం తెరమీదకు రాగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన ఈ వ్యవహారంలోనూ ఓరుగల్లు కీలకమైంది. ఎడతెగకుండా సాగుతున్న విచారణల్లో రోజుకో కొత్త అంశం తెరపైకి వస్తుండగా.. అందులో ఉమ్మడి వరంగల్‌కు సంబంధం ఉన్న ఉన్నతాధికారులు, రాజకీయ ప్రముఖుల చుట్టూ తిరుగుతున్నది. ఎప్పటి నుంచో ఫోన్ ట్యాపింగ్ అంశం ప్రచారంలో ఉన్నా.. ప్రధానంగా 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరిగిన ట్యాపింగ్ ఉమ్మడి జిల్లాకు ముడిపడి ఉండటం హాట్‌టాపిక్‌గా మారింది. కీలక ప్రజాప్రతినిధులు, అధికారులు మొదలు.. కాంగ్రెస్, బీజేపీ నేతల ఫోన్లను ట్యాప్ చేయడంతోపాటు జనగామ ఏరియాలో ఓ కేంద్రాన్నే అనధికారికంగా నిర్వహించారన్న ప్రచారం ఇప్పుడు చర్చనీయాంశం అవుతోంది.

'రెడ్‌కార్నర్' నోటీసుపై చర్చ

సంచలనం కలిగించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరికొన్ని రోజుల్లో అనుబంధ చార్జ్‌షీట్ దాఖలు చేయనుండగా.. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావును విదేశాల నుంచి రప్పించే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. గత ప్రభుత్వం హయాంలో పదేళ్ల పాటు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా కీలకంగా వ్యవహరించిన ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రభాకర్‌రావు ఈ వివాదంలో చిక్కుకోవడం.. నిజాయితీ గల అధికారిగా పేరున్న ఈయనకు రెడ్‌కార్నర్ నోటీసు జారీ కావడంపై జిల్లాలో చర్చ జరుగుతోంది. ప్రభాకర్‌రావుతో పాటు శ్రవణ్‌కుమార్‌కు రెడ్‌కార్నర్ నోటీసులు జారీ కాగా.. ఆ ఇద్దరినీ ఇండియాకు డిపోర్ట్(బలవంతంగా స్వదేశానికి తిప్పి పంపడం) చేస్తారని పోలీసులు భావిస్తున్నారు. అయితే ఆ ఇద్దరు ఇండియాకు వస్తే, వారిని సైతం విచారిస్తే.. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎవరెవరి ప్రమేయం ఉందన్న సమాచారంతో పాటు ఉమ్మడి వరంగల్‌లో ఎంతమంది ఫోన్లు ట్యాపింగ్ చేశారన్న వివరాలు కూడా బయటపడే అవకాశం ఉంది.

'ట్యాపింగ్' వెనుక జిల్లా ఉన్నతాధికారులు

2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ దూకుడును నియంత్రించేందుకు నిర్దేశించిన ఫోన్ ట్యాపింగ్ ఆపరేషన్ వెనుక వినబడిన పేర్లలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఉన్నతాధికారులే ఉన్నారు. ప్రధానంగా ఆరోపణలున్న రిటైర్డ్ ఐజీ, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు హనుమకొండ జిల్లా నీరుకుళ్లకు చెందిన వారు. ఇదేకేసులో కీలకంగా ఉన్న మాజీ డీసీపీ రాధాకిషన్‌ది జనగామ జిల్లా కాగా.. మరో అధికారి భుజంగరావు అరెస్టయ్యే నాటికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా అడిషనల్ ఎస్పీగా ఉన్నారు. ఇక ట్యాపింగ్‌కు సంబంధించి పైఅధికారుల ఆదేశాల మేరకు అన్నీ తామై వ్యవహరించారన్న ఆరోపణలున్న శ్రావణ్‌రావు, ప్రణీత్‌రావు.. ఉమ్మడి వరంగల్‌లో బినామీలతో అనధికార కేంద్రాల ద్వారా పలువురి ఫోన్లను ట్యాప్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల హైకోర్టులో నమోదైన నిందితుల వాంగ్మూలాల ఆధారంగా అసెంబ్లీ ఎన్నికలకు 15 రోజుల ముందు రాష్ట్రవ్యాప్తంగా 4,500 అక్రమ ఫోన్ ట్యాపింగ్‌లు జరగగా. అందులో ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, ప్రధానంగా జనగామ, వరంగల్, హనుమకొండ, ములుగు జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, ముఖ్యనేతల కాల్స్ కూడా ఉన్నట్లు విచారణలో తేలింది. దీంతోపాటు జనగామ జిల్లాలో అత్యంత గోప్యంగా ఓ అనధికార కేంద్రాన్ని నిర్వహించారని అప్పట్లో జరిగిన ప్రచారం కూడా నిజమేనన్న నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.

భయం.. భయంగా



పెద్దతాడిచర్లలో ఈనెల 15న కూలిన ఇల్లు (ఫైల్)

మల్హర్: బొగ్గు వెలికితీత కోసం పెడుతున్న బాంబులు ఇళ్లలో వణుకు పుట్టిస్తున్నాయి. బాంబు పేలుళ్లతో గిన్నెలు, బోళ్లు కింద పడుతున్నాయి. ఇంట్లో ఉండాలంటేనే భయం.. భయంగా బతికే పరిస్థితి నెలకొంది. ఇది మండల పరిధిలోని పెద్ద తాడిచర్ల ఉపరితల బొగ్గు గనికి కూత వేటు దూరంలో నివసించే కాలనీ వాసుల ఆవేదన. తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లో జరుగుతున్న బ్లాస్టింగ్‌లతో రోజురోజుకూ ప్రజల్లో భయాందోళన పెరుగుతుంది. ఓసీ ప్రాజెక్టు 500 మీటర్ల పరిధిలో ఇళ్లు ఉండడంతో పాటు స్థాయికి మించి బ్లాస్టింగ్ చేయడం ద్వారా తమ ఇళ్ల కప్పులు పగులుతున్నాయని, గోడలు బీటలు వారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లాస్టింగ్ సమయంలో ఉండాలంటేనే జంకుతున్నామని అంటున్నారు. పనులతో వచ్చే దుమ్ము, ధూళి ఇళ్లపై చేరడంతో పాటు, తినే ఆహార పదార్థాలపై పడుతున్నాయని చెబుతున్నారు. దీంతో రోగాల బారిన పడాల్సి వస్తుందని అంటున్నారు. బ్లాస్టింగ్ కారణంగానే మూడు నెలల కాలంలోనే రావుల మల్లమ్మ, బండి ఎల్లమ్మ అనుమాల కొమురక్క ఇళ్లు కూలిపోయాయి. చాలా మంది ఇళ్ల గోడలకు బీటలు బారాయి. డేంజర్ జోన్ ఇండ్లు సేకరించాలని ఈనెల 28న మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ రాహుల్ శర్మకు నిర్వాసితులు వినతి పత్రం సమర్పించారు.

పీఎన్ ప్రకటనకే పరిమితం..

డేంజర్ జోన్ పరిధిలో ఉన్న ఇళ్ల సేకరణకు 2022 డిసెంబర్ 14న 359.23 ఎకరాలకు 2600 చిలుకు ఇళ్లకు పీఎన్ (ప్రాథమిక నోటిఫికేషన్) ను ప్రతికల్లో ప్రచురించారు. కానీ డిక్లరేషన్ ప్రకటించకపోవడంతో సదరు నోటిఫికేషన్ రద్దయింది. దీంతో డేంజర్ జోన్ సమస్య మొదటికి వచ్చింది. నోటిఫికేషన్ వేసి ఇళ్లు సేకరించి.. తమ కు న్యాయం చేయాలని మండలానికి వచ్చిన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు. ఇప్పటికైనా జెన్కో, రెవెన్యూ అధి కారులు ఇళ్లకు మరోసారి నోటిఫికేషన్ ప్రచురించి తమ ఇళ్లను సేకరించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

సెల్‌ఫోన్ చూడొద్దని మందలించిన భర్త..

అదృశ్యమైన భార్య


చైతన్య

కాజీపేట: భర్త మందలించాడనే ఆగ్రహంతో ఓ మహిళ పుట్టింటి నుంచి అదృశ్యమైన ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వై.సుధాకర్ రెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని సోమిడికి చెందిన చైతన్యను మడికొండ ఇందిరమ్మ కాలనీకి చెందిన మ్యాదరి వేణు 17 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. చైతన్య ఇటీవల మొబైల్‌ను వినియోగిస్తూ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో ఆగ్రహించిన భర్త తరచూ సెల్‌ఫోన్ వినియోగం మంచిది కాదని హెచ్చరించాడు. దీంతో మనస్తాపం చెందిన చైతన్య పుట్టింటికి వెళ్తానని చెప్పగా వేణు ఈ నెల 26న సోమిడిలో పుట్టింట్లో వదిలేసి వచ్చాడు. తెల్లవారుజామున చైతన్య కుమారుడు అమ్మమ్మకు ఫోన్ చేసి తల్లి గురించి వాకబు చేయగా నిన్నటి నుంచి ఇంట్లో లేదని చెప్పింది. బంధు, మిత్రుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వేణు ఫిర్యాదు మేరకు ఎస్సై లవన్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ వై. సుధాకర్‌రెడ్డి వివరించారు.

ప్రతీ విద్యార్థి ఇంగ్లిష్ మాట్లాడడమే ధ్యేయం

- విల్ టు కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్


మాట్లాడుతున్న రామేశ్వర్‌గౌడ్

కాజీపేట రూరల్ : గవర్నమెంట్ స్కూల్లో చదివే ప్రతీ విద్యార్థి తెలుగు మాదిరి ఇంగ్లిష్ మాట్లాడేలా చేయడమే ధ్యేయమని 'విల్ టు కెన్' ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర పరిశోధన విద్యాసంస్థ సహకారంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యాయులకు 40 రోజుల ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాజీపేట ఫాతిమానగర్‌లో ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన ఒక రోజు ఫిజికల్ క్లాస్‌కు 200 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు తెలంగాణలో 33 జిల్లాల ఉపాధ్యాయులకు ఈ తరగతులు పూర్తి చేశామన్నారు. ఈ అవకాశం ఇచ్చిన ఎస్సీఆర్టీ డైరెక్టర్, నిర్మల్ డీఈఓకు, ఏఎంఓకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ఎం.ఎస్.మూర్తి, ఏఎంఓ లక్ష్మణ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.



వైరస్.. చేతిపైనే!

- నిత్య నేస్తాలతో బ్యాక్టీరియా ముప్పు
- ప్రతి అంశంలోనూ పరిశుభ్రత అవసరం
- అలసత్వం వహిస్తే అంతే సంగతి
- వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి భరోసా..



సెల్‌ఫోన్.. కంప్యూటర్ కీబోర్డు.. టీవీ రిమోట్.. కరెన్సీ నోట్లు.. లిఫ్ట్.. ఈ వస్తువులు మానవులు వినియోగించే నిత్య నేస్తాలు. ఈ క్రమంలో మనకు తెలియకుండానే, ఎంత పరిశుభ్రంగా ఉన్నా ఈ వస్తువులపై ప్రమాదకరమైన బ్యాక్టీరియా అవశేషాలు పోగుపడుతున్నాయి. కంటికి కనిపించని బ్యాక్టీరియా చేయి పట్టుకుని మన వెంటే వస్తోంది. అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ అరిజోనా మైక్రోబయాలజీ విభాగం ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో కొన్ని ఆశ్చర్యకరమైన ఫలితాలు వెల్లడయ్యాయి. మనం రోజు వారీ చేసే పనుల్లో కొన్ని ఆరోగ్యానికి ముప్పుగా పరిణమిస్తాయని తెలుసుకుంటే షాక్ గురికావాల్సిందే. ఈ నేపథ్యంలో ఏ వస్తువులో ఎలాంటి బ్యాక్టీరియా ఉంటుందో? దాని వల్ల ఎలాంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందో తెలుసుకుందాం.

కాజీపేట: నిత్యం మనం రకరకాల వస్తువులు పట్టుకుంటాం. ఆ చేతితోనే సెల్‌ఫోన్ వాడుతాం. దీంతో బ్యాక్టీరియా ఫోన్ మీద చేరుతుంది. అదే చేతులతో ఆహార పదార్థాలు తింటే అనారోగ్యాలను కొని తెచ్చుకున్నట్లే. సెల్‌ఫోన్ తెరపై సుమారు 25వేల క్రిములు ఉంటాయని పరిశోధనల్లో తేలింది. మొత్తం 250 ఫోన్లను పరీక్షించి 94.5 శాతం ఫోన్లపై బ్యాక్టీరియా అవశేషాలు ఉన్నట్లు గుర్తించారు. ఆశ్చర్యకర విషయం ఏమిటంటే బాతురూమ్‌లో ఉండే బ్యాక్టీరియా కంటే 18 రెట్లు ఎక్కువ సెల్‌ఫోన్ హానికారక బ్యాక్టీరియాకు నిలయమని అవగతమవుతుంది. స్టాఫ్లాకోకస్, కోయాడ్యుటేజ్ నెగిటివ్ స్టాఫ్ వంటి బ్యాక్టీరియా ఉన్నట్లు వెల్లడైంది. వీటి వల్ల రక్తంలో ఇన్‌ఫెక్షన్, చర్మ, ఎముకల సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

కంప్యూటర్ కీ బోర్డులతో జాగ్రత్త..

కార్యాలయాలు, ఇంటిలో వాడే కంప్యూటర్లు, లాప్‌టాప్‌ల కీబోర్డులు అత్యంత ప్రమాదకరమైనవే. కంప్యూటర్ స్క్రీన్, కీబోర్డు, మౌస్‌లు కూడా బ్యాక్టీరియా కేంద్రంగా ఉంటాయని వినియోగదారులు గుర్తించాలి. ఇంటిలో ఉండే కీబోర్డుల కంటే ఇంటర్‌నెట్ సెంటర్లు, సైబర్ కేఫ్‌లలో ఉండే వాటిపై వందరేట్ల క్రిములు అధికంగా ఉంటాయని గుర్తించారు. ఎంటిరోకోకస్, పీజీఎం స్టాఫికోకస్ వంటి క్రిములు వీటిపై ఆవహించి ఉంటాయి. వీటితో ఊపిరితిత్తుల వ్యాధులు, రక్తంలో ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది.

టీవీ రిమోట్‌తో జాగ్రత్త...

ఇంట్లో టీవీ రిమోట్‌ను ముట్టనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ప్రతి ఇంట్లో టీవీ తప్పనిసరి. దగ్గినా, తుమ్మినా బ్యాక్టీరియా దీనిపైకి చేరుకునే అవకాశం ఉంది. ఒక్కో టీవీపై 324 రకాల క్రిములు ఉంటాయని అంచనా. టీవీల కంటే రిమోట్లు అత్యంత ప్రమాదకరం. హోటళ్లు, ఆస్పత్రుల్లోని రిమోట్లలో బ్యాక్టీరియా అధికంగా పోగుపడి ఉంటుంది.

కరెన్సీ నోట్లు ప్రమాదకరమే..

నిత్య వినియోగంలో ఉండే కరెన్సీ కోట్లాది మంది చేతులు మారుతుంది. వీటిపై అధిక శాతం క్రిములు ఉంటాయి. పేపర్ ఆధారిత కరెన్సీ నోట్లపై బ్యాక్టీరియా అధికంగా చేరుతుంది. ఒక అంగులం వెడల్పు ఉండే నోట్లపై 100కు పైగా క్రిములు ఆశించి ఉంటాయి. కరెన్సీ నోట్లపై క్రిములు శరీరంపై శరవేగంగా దాడి చేస్తాయి.

లిఫ్ట్ బటన్‌లోనూ బ్యాక్టీరియా జాగ్రత్త..

నగరంలో గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్ కల్చర్ భారీగా పెరిగింది. ప్రతి చోట లిఫ్ట్‌లు ఉండడం సర్వ సాధారణంగా మారింది. కామన్ లిఫ్ట్ బటన్ బ్యాక్టీరియా స్థావరంగా చెప్పొచ్చు. షాపింగ్ మాల్స్, ఆస్పత్రుల్లో కొన్ని వందల మంది లిఫ్ట్ బటన్లు నొక్కుతుంటారు. అధిక రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఉన్న లిఫ్ట్ బటన్లపై నివాస ప్రాంత బటన్ల కంటే వంద రేట్లు ఎక్కువ క్రిములు ఉంటాయి.

అప్రమత్తత అవసరం..



మనం నిత్యం వాడే ఎన్నో వస్తువులపై బ్యాక్టీరియా, వైరస్‌లు చేరడం సాధారణ అంశం. క్రిములు 24 గంటల వరకు జీవిస్తాయి. సెల్‌ఫోన్, రిమోట్, కంప్యూటర్లు వినియోగించిన తర్వాత యాంటీ బ్యాక్టీరియల్ లిక్విడ్‌తో చేతులు శుభ్రం చేసుకోవడం మంచిది. వివిధ వస్తువులు పట్టుకున్న తర్వాత కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఆహార పదార్థాలు తింటే జీర్ణకోశ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. పిల్లలను హానికర బ్యాక్టీరియాకు దూరంగా ఉంచాలి.

-డాక్టర్ మధులత, విష్ణుపురి

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

- మెదక్‌పై వరంగల్, నల్లగొండపై మహబూబ్‌నగర్ జట్లు విజయం


మొగిలిచర్ల గ్రౌండ్‌లో తలపడుతున్న వరంగల్, మెదక్ జట్ల క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ కేంద్రంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల స్థాయి అండర్–19 క్రికెట్ పోటీలు రెండో రోజు ఆదివారం హోరాహోరీగా సాగాయి. మొగిలిచర్ల మైదానంలో వరంగల్, మెదక్ జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వరంగల్ ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు 49.2 ఓవర్లు ఆడి 219 పరుగుల వద్ద అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్ బరిలోకి దిగిన మెదక్ జట్టు 29.4 ఓవర్లను మాత్రమే ఆడి 110 పరుగుల వద్ద అన్నీ వికెట్లను కోల్పోయి 109 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. కోమటిపల్లి మైదానంలో మహబూబ్‌నగర్, నల్లగొండ మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందు బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ 50 ఓవర్లకు గానూ 8వికెట్లను కోల్పోయి 186 పరుగులను సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన నల్లగొండ జట్టు 32 ఓవర్లు ఆడి 98 పరుగుల వద్ద అన్ని వికెట్లు కోల్పోయింది. 88 పరుగుల తేడాతో మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించింది. పూల్ 'ఏ' లో ఇప్పటి వరకు సాగిన మ్యాచ్‌ల్లో మహబూబ్‌నగర్, వరంగల్ జట్లు ముందంజలో ఉన్నాయి. ఈ సందర్భంగా రెండు జట్ల క్రీడాకారులను వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, మార్నేని ఉదయభానురావు, బండారి ప్రభాకర్, మట్టెడ కుమార్ తదితరులు అభినందించారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

- మోడల్ స్కూల్ విద్యార్థుల ఘనత


విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేస్తున్న నిర్వాహకులు

మరిపెడ రూరల్: మరిపెడ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఘనత సాధించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఖమ్మం పట్టణ కేంద్రానికి చెందిన వురిమళ్ల ఫౌండేషన్, అక్షరాలతోవ వారి ఆధ్వర్యంలో వురిమళ్ల ఫౌండేషన్ 6వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన పుస్తక సమీక్ష పోటీల్లో మరిపెడ మండలం మోడల్ స్కూల్ విద్యార్థులు నందిగామ స్వరూప, జి. లక్ష్మీనందిని ప్రతిభ కనబరిచారు. దీంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వారికి చోటు దక్కింది. ఖమ్మం పట్టణంలో మంచి కంటి భవన్‌లో నిర్వాహకులు అవార్డులు అందజేశారు. సాహిత్యంపై మక్కువతో తెలుగు ఉపాధ్యాయులు యెలిశాల నాగమోహన్ ప్రోత్సాహంతో పెన్ కౌంటర్, చైతన్య దీపాలు పుస్తకాలపై విద్యార్థులు రాసిన సమీక్షల సమహారం పుస్తక సంకలనంలో చోటు దక్కించుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మరిపెడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అక్తర్ రుజ్మాన్, ఉపాధ్యాయులు, నందిగామ జనార్దన్ అభినందించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

- కాంప్రెషర్‌తో తొలగించిన రాళ్లు
- బయటపడిన శివలింగం ప్రాణవట్టం


అమ్మవారి విగ్రహం చుట్టూ తవ్వకాలు జరిపిన దుండగులు

దామెర: గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలంలోని పులుకుర్తిలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. పులుకుర్తి శివారులోని చంద్రగిరి గుట్టల్లో దుండగులు కొంతకాలంగా యథేచ్ఛగా గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపడుతున్నారు. గుట్టలోని పెద్ద రాయిపై ఉన్న అమ్మవారి విగ్రహం చుట్టుపక్కల తవ్వకాలు చేపట్టారు. కాగా, ఆ తవ్వకాల్లో శివలింగం ప్రణవట్టం బయట పడిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి. గుట్ట ప్రాంతం నిర్మానుష్యంగా ఉండడంతో ఇదే అదునుగా భావించిన వ్యక్తులు రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వకాలు చేపడుతున్నట్లు తెలిసింది. తవ్వకాలు చేస్తున్న చోట పెద్ద బండలు అడ్డుగా ఉండడంతో కాంప్రెషర్ సాయంతో వాటిని తొలగించి గుప్తనిధుల కోసం తమ వేట కొనసాగిస్తున్నారు. ఈ తవ్వకాల్లో పులుకుర్తికి చెందిన ఒక నాయకుడు, నగరానికి చెందిన కొంతమంది హస్తం ఉన్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. గతంలో చంద్రగిరి గుట్టపై ఉన్న చంద్రగిరి చెన్నకేశవస్వామి ఆలయం, శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయంలో సైతం దుండగులు తవ్వకాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇంత జరిగినా పోలీసులు, పురావస్తు శాఖ, దేదాయ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా దృష్టిసారించి దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపు

- కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి
- ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

హసన్‌పర్తి: క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజీయెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు స హజమని, ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని విజ యం కోసం ప్రయత్నించాలన్నారు. ఈ టోర్నమెంట్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 800 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ పురుషుల(ఫేజ్–1) టోర్నమెంట్ రెండు రోజుల పాటు జరగనుంది. కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ఏఓ డాక్టర్ రమేశ్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ల సంఘం జిల్లా కార్యదర్శి వెంకన్న, కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, కిట్స్ కళాశాల పీడీ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు రిజిస్ట్రార్‌ను సన్మానించారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి

- లక్ష్మీపురం మార్కెట్ కమీషన్ వ్యాపారుల డిమాండ్


లక్ష్మీపురం మార్కెట్

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని వరంగల్ జిల్లా కూరగాయల కమీషన్ వ్యాపారుల సంఘం నూతన పాలకవర్గానికి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రత్యక్షంగా ఎన్నికలు నిర్వహించాలని వ్యాపారులు డిమాండ్ చేశారు. కమీషన్ వ్యాపారుల సంఘం జూన్ 29వ తేదీన రద్దు చేసి నూతన కమిటీ ఎన్నుకునేందుకు ఆరుగురు కమీషన్ వ్యాపారులతో ఎన్నికల నిర్వహణ కోసం స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. స్టీరింగ్ కమిటీ పలుమార్లు వ్యాపారులతో సమావేశమై ఏకగ్రీవం కోసం చర్చలు జరిపినా నలుగురు అధ్యక్షులుగా పోటీ పడతామని చెప్పడంతో ఎన్నికలు వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈక్రమంలో వినాయకచవితికి ముందు నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 90శాతం మంది ఏకగ్రీవం చేయొద్దని, తప్పని సరిగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణలో విఫలమైన స్టీరింగ్ కమిటీని రద్దు చేయడంతో పాటు పాత కమిటీ(అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి) మళ్లీ ఎన్నికల నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. మళ్లీ రంగంలోకి దిగిన పాత కమిటీ నాయకులు రెండు రోజుల క్రితం మార్కెట్‌లోని ఏ బ్లాక్‌లోని 22మంది కమీషన్ వ్యాపారులతో సమావేశం నిర్వహించి ప్రధానంగా అధ్యక్షులుగా పోటీ పడేందుకు సిద్ధంగా ఉన్న మున్నాబాయ్, బేతి అశోక్ మధ్య సమన్వయం చేసేందుకు ప్రయత్నించారు. అదే సమావేశంలో కొంత మంది వ్యాపారులు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలిందే అని పట్టుపట్టారు. సమావేశంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో దసరా పండుగ అనంతరం ఎన్నికలు నిర్వహిస్తామని నాయకులు చెప్పి వాయిదా వేశారు.


ఏకగ్రీవంగా ఎందుకు!

కమీషన్ వ్యాపారుల సంఘం నూతన కమిటీకి పాత కమిటీ లెక్కలు బహిరంగంగా చెప్పకుండా వారికి అప్పగిస్తే సరిపోతుందన్న అభిప్రాయంతోనే ఏకగ్రీవం అని అంటున్నారని పలువురు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని మెజార్టీ కమీషన్ వ్యాపారులు కోరుతున్నా ఎందుకు ఏకగ్రీవం అంటున్నారో అర్థం కావడం లేదని వారు పేర్కొంటున్నారు. సంఘానికి ప్రత్యక్షంగా ఎన్నికలు జరపాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

మాకు అవకాశం కల్పించాలి

ప్రస్తుతం సంఘంలో 91మంది సభ్యులు ఉండగా కొత్తగా మరో 9మందికి మార్కెట్ కమిటీ కమిషన్ వ్యాపారులుగా లైసెన్స్‌లు జారీ చేశారు. పాత కమిటీలో ఉన్న సభ్యులకు తాజాగా లైసెన్స్‌లు పొందిన వారితో పాటు తమకు ఎన్నికల్లో అవకాశం కల్పించాలని మినీ హోల్‌సేల్ వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. కమీషన్ లైసెన్స్‌లు ఉన్న వ్యాపారుల్లో చాలా మంది క్రయ, విక్రయాలు జరపడం లేదని, నెలకు వేల రూపాయల్లో కమీషన్ వ్యాపారం చేస్తూ మార్కెట్ ఫీజులు చెల్లిస్తున్న నేపథ్యంలో ఈఎన్నికల్లో అవకాశం కల్పించాలని కోరుతున్నారు.


లెక్కలు చూపాల్సిందే



కమీషన్ వ్యాపారుల సంఘం పాత కమిటీ తమ ఆరేళ్ల కాలంలో జరిగిన ఆదాయ, వ్యయాలపై లెక్కలు సర్వసభ్య సమావేశంలో వెల్లడించిన అనంతరం ఎన్నికలు నిర్వహించాలి. కొత్త కమిటీ ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీని ఎందుకు రద్దు చేశారో చెప్పాలి.

గుర్రాల మోహన్, కమీషన్ వ్యాపారి

ఎన్నికలు ప్రత్యక్షంగానే జరపాలి



కమీషన్ వ్యాపారుల సంఘం ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలోనే జరపాలి. ఏకగ్రీవ కమిటీని ఏర్పాటు చేయొద్దు. వ్యాపారుల్లో మెజార్టీ మంది ఏకగ్రీవంగా కాకుండా ప్రత్యక్షంగా జరపాలని డిమాండ్ చేస్తున్నా ఎందుకు వెనుకడుగు వెస్తున్నారో చెప్పాలి.

రవీందర్‌రావు, కమీషన్ వ్యాపారి

ఉత్సాహంగా రెజ్లింగ్ ఎంపికలు

- హాజరైన 120 మంది క్రీడాకారిణులు


రెజ్లింగ్ ఎంపికలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–14, 17 బాలికల రెజ్లింగ్ ఎంపిక పోటీలు ఆదివారం హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఈ ఎంపిక పోటీలకు తెలంగాణ అమ్యోచూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖరీం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారిణులు అధిక సంఖ్యలో హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. క్రీడలపై గ్రామీణ ప్రాంత తల్లిదండ్రుల్లో అవగాహన కలగడం హర్షణీయమన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 120 మంది క్రీడాకారిణులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దస్రూ నాయక్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు అక్టోబర్ 3 నుంచి 5వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రెజ్లింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజ్‌కుమార్, డీఎస్‌ఏ రెజ్లింగ్ కోచ్ కె. రాజు, రెఫరీలు ఎస్. మహేశ్, ఇ. దేవేందర్, పీఈటీలు జి. రవీందర్, జ్యోతి, ముఖర్జీ, లావణ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల 'అపూర్వ' సమ్మేళనం


వేదికపై పూర్వక్రీడాకారులు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1950 నాటినుంచి ఇప్పటి వరకుగల వాలీబాల్ క్రీడాకారులు సుమారు 200 మంది ఆదివారం కలుసుకున్నారు. వాలీబాల్ కోచ్ కందునూరి కొమురయ్య 12వ వర్ధంతి సందర్భంగా ఇనుగుర్తి మొదటితరానికి చెందిన 70 ఏళ్ల నాటి వాలీబాల్ పూర్వ క్రీడాకారులతోపాటు, పలువురు సీనియర్ క్రీడాకారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పాఠశాల మైదానంలో మహిళలు, పురుషులు వేర్వేరుగా ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు. అమ్మమ్మలుగా, నానమ్మలుగా, తాతయ్యలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వయసులో కూడా ఎంతో ఉత్సాహంగా పూర్వక్రీడాకారులు వాలీబాల్ ఆడడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం మొదటితరం పూర్వక్రీడాకారుడు ఓరుగంటి రామస్వామిని అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు కన్న వెంకట్‌నారాయణ, జాతీయస్థాయి క్రీడాకారులు జంపయ్య, గీత, సీనియర్ క్రీడాకారులు సట్ల భిక్షపతి, సట్ల సోమయ్య, తాళ్లపల్లి సాంబయ్య, భాగ్యమ్మ, కన్న సాంబయ్య ను సన్మానించారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

- అటవీ ఉద్యోగుల క్రీడలు షురూ..
- జోనల్ పరిధి నుంచి హాజరైన 650 మంది
- పోటీలను ప్రారంభించిన సీసీఎఫ్ భీమానాయక్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న భీమానాయక్

చుంచుపల్లి: కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అటవీ శాఖ ఉద్యోగుల జోనల్ స్థాయి క్రీడా పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఇందుకోసం రెండు ప్రాంగణాలను వినియోగిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి 650 మంది అటవీ ఉద్యోగులు హాజరు కాగా, అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, షటిల్, రన్నింగ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు కబడ్డీ, షటిల్, రన్నింగ్, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించగా, సీసీఎఫ్ భీమానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిత్యం ఒత్తిడితో ఉండే అటవీ ఉద్యోగులకు క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అటవీ, పర్యావరణ పరిరక్షణలో అటవీ ఉద్యోగుల పాత్ర మరవలేనిదని చెప్పారు. అప్పుడప్పుడూ సిబ్బంది క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. ఆరోగ్యం పరిరక్షణకు తగిన వ్యాయామంతో పాటు క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈ రెండు రోజుల పాటు నిర్వహించే క్రీడాంశాల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అటవీ అధికారులు కిష్టాగౌడ్, సిద్ధార్థ విక్రమ్ సింగ్, బత్తుల విశాల్, బి.లావణ్య, అనూజ్ అగర్వాల్‌తో పాటు డీసీఎఫ్, ఎఫ్‌డీఓలు పి. కృష్ణమాచార్య, కె.దామోదర్‌రెడ్డి, ఏసీఎఫ్, ఎఫ్‌డీఓలు ఎస్.సుజాత, సయ్యద్ మక్సూద్, బి.బాబు, వి.చంద్రశేఖర్, వి.మంజుల, యు.కోటేశ్వరరావు, సందీప్‌రెడ్డి, భాగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


చందర్‌రావు మృతదేహం

వెంకటాపురం(కె): మండల పరిధిలోని యోగితా నగర్ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. యోగితా నగర్ గ్రామానికి చెందిన నాగుల చందర్‌రావు (45) అవసరం నిమిత్తం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో చందర్‌రావు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన గ్రామస్తులు హుటిహుటిన 108 అంబులెన్స్‌లో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు చందర్‌రావుకు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు.

JAYAMUKHI COLLEGE OF TEACHER EDUCATION
Moqdumpuram, Narsampet-Warangal, 506 332

NOTIFICATION FOR ADMISSION INTO B.ED. COURSE UNDER CATEGORY-B (MANAGEMENT QUOTA) SEATS FOR THE ACADEMIC YEAR 2024-2026

Applications from eligible candidates are invited for admission into B.Ed. Course in Mathematics, Physical Science, Biological Science, Social Sciences and English Methodologies under **Category 'B'** (Management Quota) seats in the prescribed format available in the office on or before 08-10-2024.

College Code	Course	B.Ed.
JAYA	Total Intake	50
	B. Category Seats (25%)	12

Date: 29-09-2024 Sd/- SECRETARY- CUM –CORRESPONDENT

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

ఫామ్ ల్యాండ్

■ నవరాత్రి ఇన్ఫ్రా వారి వరంగల్– ఖమ్మం హైవే ఉప్పరపల్లి క్రాస్ దగ్గర కొత్తగా మొదలవుతున్న 30 ఎకరముల ఫామ్ ల్యాండ్ వెంచర్ నందు ఇన్వెస్ట్‌మెంట్ పార్టనర్స్ కావలెను. ఆసక్తి గలవారు సంప్ర: +91 9392758621. [WA-7542]

SERVICES

CHANGE OF NAME

■ I, Ravula Samatha, D/o. Ravula Sidda Reddy, R/o. H.No 1-1-33/111/301, Mitra Residency, Chaitanyapuri Colony, Near NIT, RE College, Hanamkonda Mandal, Hanumakonda Dist, Telangana State 506004. India has changed my name from RAVULA SAMATH, D/o. RAVULA SIDDA REDDY to RAVULA SAMATHA, D/o. RAVULA SIDDA REDDY. [W-1237309]

FINANCIAL SERVICES

■ బాలాజీ లోన్స్ తక్కువ వడ్డీకే చేయబడును. బిజినెస్, మార్టిగేజ్, హోమ్, టేకోవర్ లోన్స్, ప్లాట్ లోన్ ఇవ్వబడును. I.T. రిటన్స్, G.S.T, పాన్‌కార్డ్. కాకతీయ థియేటర్ దగ్గర, వరంగల్. 85228 25358. [M-1185296]

WANTED

■ స్టార్ హోమ్‌కేర్ సర్వీసు 24 గం॥ పేషెంట్లు పెద్దవారిని వారి ఇంటి వద్దనే ఉండి 24 గం॥ డ్యూటీ చేయడానికి, కేర్‌టేకర్, ఆయాలు, మగవారు / ఆడవారు కావలెను. 9100116067, 9059016067 [W-1239915]

■ మా ఆఫీస్‌లో పని చేయుటకు Telecallers, Receptionist, Management, Marketing, Supervisor, Office Boy (స్త్రీ/పు) కావలెను. Cont: 7382323126, 9491706517. [W-1237305]

■ మా అపార్ట్‌మెంట్స్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, స్వీపర్స్ (స్త్రీ/పురుషులు) కావలెను. Cont: 9491710857, 7382106287. [W-1237306]

■ త్రినేత్ర హోమ్‌కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీతం: 17K. ఫోన్: 8520874499, 8520980099 [H-796282]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.